www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 9 జనవరి 2025 5 కాకినాడ

నవోదయ ఎంట్రన్స్ టెస్ట్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కరప

మండలంలో 5వ తరగతి విద్యార్థులకు నవోదయ ఎంట్రన్స్ టెస్ట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం స్థానిక జడ్‌పి హైస్కూల్లో జరిగిన ఈ అవగాహనా కార్యక్రమంలో ఎంఇఒలు కెబి.కృష్ణవేణి పి.సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎం.అనుపమ మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని అన్నారు. ఈ అవగాహనా కార్యక్రమంలో 139 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, సిఆర్‌పిలు రాజు, సారాకుమారి, సునీత, సత్యనారాయణ, నాగలక్ష్మి, యుటిఎఫ్, పిఆర్‌టియు, ఎస్‌టియు, ఎపియుఎస్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల వ్యవస్థను పునరుద్ధరించాలి

- యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ తీర్మానం
- రాష్ట్ర నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
- అధ్యక్షునిగా ఎం.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కెఎస్ఎస్.ప్రసాద్
- విజయవంతంగా ముగిసిన మహాసభ

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, కాకినాడ

ప్రాథమిక పాఠశాల వ్యవస్థ(1 నుంచి 5 తరగతులు)ను పునరుద్ధరించాలని యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. కాకినాడలో జరుగుతున్న స్వర్ణోత్సవ మహాసభ బుధవారంతో ముగిసింది. చివరి రోజు రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రతినిధుల సభ జరిగింది. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని యాజమాన్య పాఠశాలలను ఒకే విద్యా గొడుగు కిందకు తెచ్చేందుకు యుటిఎఫ్ కృషి చేస్తుందన్నారు. అవసరమైతే ఎల్‌కెజి, యుకెజిలను కూడా వీటిలోనే నిర్వహించాలన్నారు. ప్రాథమిక విద్యాభ్యాసం మాతృభాషలో జరగాలన్నారు. హైస్కూల్లో రెండు మీడియంలలో బోధన కొనసాగించాలన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, సాంకేతిక స్పృహ పెంపొందించాలన్నారు. అనంతరం రాష్ట్రంలో 26 జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో జిల్లాల వారీగా విశ్లేషణ జరిపి చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ కార్యక్రమాల నిర్వహణా బాధ్యతలు చేపట్టిన కాకినాడ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నగేష్, టి.చక్రవర్తి మాట్లాడుతూ ఈ మహాసభకు సహకరించిన ప్రజాసంఘాలకు, వివిధ శాఖల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.ప్రసాదరావు, చిలుకూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిల కోసం యుటిఎఫ్ కార్యచరణ తీసుకుందని చెప్పారు.

మహాసభలో మాట్లాడుతున్న డిఇఒ రమేష్

చివరి రోజు మహాసభలో కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల బకాయిల విషయాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రభుత్వం త్వరలో వీటిని చెల్లిస్తుందన్నారు. గత ప్రభుత్వం జల జీవన్ పథకం నిధులు రూ.21 వేల కోట్లను సక్రమంగా ఖర్చుపెట్టలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు.

కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ మాట్లాడుతూ యుటిఎఫ్ నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయ సంఘమన్నారు. స్వర్ణోత్సవాలు జరుగుతున్న కాకినాడ పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విబి.తిరుపాణ్యం మాట్లాడుతూ తమ కళాశాలలో యుటిఎఫ్ సర్ణోత్సవాలు జరుపుకోవడం హర్షణీయమన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

యుటిఎఫ్ రాష్ట్ర మహాసభ చివరి రోజు రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక జరిగింది. రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, అధ్యక్షులుగా ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కెఎస్ఎస్.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కె.సురేష్ కుమార్, ఎఎన్.కుసుమకుమారి, కోశాధికారిగా ఆర్.మోహన్‌రావు, 15 మంది రాష్ట్ర కార్యదర్శులతో నూతన కమిటీ ఏర్పడింది. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టిఎస్ఎన్ఎల్.మల్లేశ్వరరావు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులుగా కె.సురేష్ కుమార్, ప్రచురణాల కమిటీ ఛైర్మన్‌గా ఎం.హనుమంతరావు, కుటుంబ సంక్షేమ పథకం అధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, అధ్యయన కమిటీ అధ్యక్షులుగా పి.బాబు రెడ్డి ఎన్నికయ్యారు.

నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడానికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందని పిలుపునిచ్చారు. స్వర్ణోత్సవ మహాసభను ఘనంగా నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి కార్యకర్తలను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో సభ్యత్వం జనరల్ ఫండ్ అధికంగా వసూలు చేసిన శాఖలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సభలో పలు కొత్త పుస్తకాలను ఆవిష్కరించారు. నాలుగు రోజులుగా అనేక సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించిన ఉపాధ్యాయ బృందాలకు బహుమతులు అందించారు.

తీర్మానాలు ఇవీ...

యుటిఎఫ్ 17వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభల పలు తీర్మానాలను ఆమోదించారు. ప్రధానంగా సిపిఎస్ రద్దు, 117 జిఒ రద్దు, ప్రాథమిక పాఠశాల వ్యవస్థ 1-5 తరగతులు పునరుద్ధరణ, హై స్కూల్‌లో తెలుగు, ఇంగ్లీష్ మీడియం కొనసాగించాలని, ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయులకు ప్రమోషనులు కల్పించాలని, 12వ నూతన వేతన సవరణ సంఘం నియమించాలి, ఐఆర్ వెంటనే చెల్లించాలని తీర్మానం చేశారు. అలాగే ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, యాప్స్ భారం తగ్గించాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, నూతన విద్యా విధానం రద్దు చేయాలని, కామన్ సర్వీస్ రూల్స్ సాధన, జూనియర్ లెక్చరర్స్ ప్రోమోషన్లు ఇవ్వాలని, మున్సిపల్ టీచర్ల, ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం, ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని తీర్మానాలు చేశారు. వీటిని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది

అంతిమ యాత్రలో పాల్గొన్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

రాఘవమ్మకు కన్నీటి వీడ్కోలు

తొత్తరమూడిలో అంత్యక్రియలు పూర్తి

సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు హాజరు

నివాళులర్పించిన పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి - అమలాపురం, అయినవిల్లి

కుడుపూడి రాఘవమ్మకు ప్రజలు, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో బాధ పడుతూ ఆమె మంగళవారం స్వగ్రామమైన అయినవిల్లి మండలం తొత్తరమూడిలో తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియులు బుధవారం నిర్వహించారు. పలువురు సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు. ఐద్వా సీనియర్ నాయకులు టి.సావిత్రి, సిపిఎం నాయకులు జి.బేబిరాణి తదితరులు ఆమె పాడెను మోస్తూ అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

సిపిఎం జెండాను కప్పుతున్న ఎంఎల్‌సి ఐవి

పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు రాఘవమ్మ భౌతికకాయంపై సిపిఎం జెండాను ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాఘవమ్మ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఎర్ర జెండా పట్టుకుని ఏళ్ల తరబడి ప్రజా సమస్యలపై పోరాటం చేశారాన్నరు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కమ్యూనిస్టులు ప్రజా సంఘాల నాయకులతో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. భర్త మరణం తరువాత కూడా ఉద్యమాల్లోనే కొనసాగారన్నారు. ఆమెను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాడటమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. అనంతరం సిపిఎం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.కృష్ణవేణి సిపిఎం కాకినాడ జిల్లా నాయకులు దువ్వా శేషాబాబ్జి, జి.బేబిరాణి, కెఎస్.శ్రీనివాస్, ఎం.రాజ్ శేఖర్ మాట్లాడుతూ కుడిపూడి రాఘవమ్మ నాటి నుంచి నేటి వరకు ప్రజా సమస్యలపై విశ్రాంతిలేని పోరాటం చేశారన్నారు. అనేక సమస్యలు ఎదుర్కొంటూ పార్టీ విలువలకి కట్టుబడి తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జి.దుర్గాప్రసాద్, టి.నాగవరలక్ష్మి, వ్యవసాయకార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి సింహాచలం, పలివెల వీరబాబు, ఎం.వెంకటరమణ, ఎం.రామకష్ణ, పి.రామకృష్ణ, సిహెచ్.పద్మ, పీతల రామచంద్రరావు, వెంకట్రావు, కాంత్రికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

నియోజకవర్గ పరిధిలో ఆర్‌ఎల్‌ఆర్‌సి ఇళ్ల నిర్మాణాలను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇఇ కెవిఆర్.గుప్తా అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎల్‌ఆర్‌సి పథకంలో నియోజకవర్గంలో 8,771 గృహాలు నిర్మిస్తుండగా వీటిలో 4,400 గృహాలు నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన 4,371 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. వీటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన 2వ విడత కార్యక్రమంలో లబ్ధిదారుల సర్వే ముమ్మురంగా జరుగుతుందని, ఈ సర్వే ను వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన వారి జాబితాన్ని రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గహ నిర్మాణ శాఖ ఇఇ వై.శ్రీనివాస్, డిఇ బి.సువర్ణరాజు, సామర్లకోట మండల ప్రత్యేకాధికారి రాజేంద్ర, ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ

కొనసాగిన కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

చిన్నింపేట జీడిపిక్కల కార్మికుల ఆందోళన బుధవారం నాటికి 54వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ ప్రధాన ద్వారం వద్ద జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఫ్యాక్టరీని మూసివేయడంతో 54 రోజులుగా కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఫ్యాక్టరీని మూసివేసిన నాటి నుంచి వివిధ రూపాల్లో తమ ఆవేదనను ప్రభుత్వానికీ, ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియ చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అనిశెట్టి వీలరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, బి.ఆది, ఎం.కాంతారావు, రామదుర్గ, జయలక్ష్మి, అన్నపూర్ణ, శివలక్ష్మి, పాపారత్నం, చంటి, వరలక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు.

ధర్నా చేస్తున్న ఫ్యాక్టరీ కార్మికులు

విధుల నుంచి తొలగింపుపై ఆవేదన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

విఒఎ విధుల తనను అకారణంగా తొలగించారంటూ ఉప్పాడ-2 విఒఎ తిరంశెట్టి చిన్ని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తన ఇద్దరు చిన్నారులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. తాను గత 16 నెలలుగా వెలుగు కార్యాలయంలో విఒఎగా విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. నాటి ఎపిఎం షకీనా ప్రియదర్శిని విఒఎగా బాధ్యతలు అప్పగించారని, నాటి నుంచి నేటి వరకూ ఉప్పాడ-2 విఒఎగా విధులు నిర్వరిస్తున్నట్లు చెప్పారు. అయితే ఆన్‌లైన్‌లో నేడు తన పేరు తొలగించారని, దీనికి కారణం ప్రస్తుత ఎపిఎం అని ఆమె ఆరోపించారు. తాను ఇద్దరు చిన్నారులతో ఉన్నానని, తన కుటుంబ పోషణ ఎలా అని ఆమె ప్రశ్నించారు. డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, కలెక్టర్, డిఆర్‌డిఎ పీడీల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. దీనిపై ఎపిఎం తౌడును వివరణ కోరగా గ్రామ సంఘాల సభ్యులు చేసే తీర్మాణాలకు అనుగుణంగానే విఒఎల నియామకాలు, తొలగింపులు ఉంటాయని, ఎపిఎం, సిసిలకు ఎటువంటి ప్రమేయం ఉండదని వివరణ ఇచ్చారు.

మీడియాతో మాట్లాడుతున్న విఒఎ చిన్ని

విజయవాడలో ఉప్పాడ విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

విజయవాడలో నీట్ కోచింగ్ తీసుకుంటున్న ఉప్పాడ గ్రామానికి చెందిన విద్యార్థిని బుధవారం మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం...ఉప్పాడ గ్రామానికి చెందిన రామిశెట్టి దుర్గభవాని (17) విజయవాడ శ్రీ చైతన్య సరస్వతీ కాలేజీలో హాస్టల్‌లో ఉంటూ నీట్ కోచింగ్ తీసుకుంటుంది. అయితే బుధవారం ఉదయం 6 గంటలకు విద్యార్థిని తండ్రికి కాలేజీ యాజమాన్యం ఫోన్ చేసి మీ పాపకు తలపోటుగా ఉందని, ప్రస్తుతం జండూబామ్ రాయడంతో విశ్రాంతి తీసుకుంటుందని తెలిపారు. మరో 20 నిమిషాల్లో మీ పాపకు విపరీతంగా తలపోటు వస్తుండడంతో విజయవాడ కామినేని ఆస్పత్రికి తరలిస్తున్నామని చెప్పారు. కుటుంబీకులు విజయవాడ బయలుదేరే సమయంలో మరో 30 నిమిషాల్లో విద్యార్థిని మృతి చెందిందని సమాచారం ఇచ్చారు. కేవలం ఒక గంట వ్యవధిలో 3 దఫాలు ఫోన్ చేసిన యాజమాన్యం మూడు రకాలుగా విషయాన్ని చెప్పడంపై కుటుంబీకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం విద్యార్థిని దుర్గ భవాని ఫోన్ చేసి తల్లిదండ్రులతో మాట్లాడిందని, ఆమెకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని తెలిపారు. ఆమె మృతిపై విచారణ చేసి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బంధువులు కోరారు.

దుర్గాభవాని(ఫైల్‌ఫొటో)

మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ శ్రీదేవి మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ బచ్చు శ్రీదేవి (80) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. స్వాతంత్ర పోరాట కాలం నుంచి ఆమె కుటుంబం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతోంది. ఆమె భర్త బచ్చు రామమోహన్రావు పెద్దాపురం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా పని చేశారు. 1995 నుంచి 2000 సంవత్సరం వరకు ఆమె మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ప్రజలకు సేవలు అందించారు. ఆమె మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

శ్రీదేవి(ఫైల్‌ఫొటో)

పలువురి సంతాపం

మున్సిపల్ మాజీ ఛైర్మన్ బచ్చు శ్రీదేవి మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు, ఆర్.వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, మహపాతిన రాంబాబు, కూనిరెడ్డి అప్పన్న, నెక్కల నరసింహ మూర్తి తదితరులు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఆమె మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో పట్టణ అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మాజీ కేంద్ర మంత్రి ఎంఎం.పల్లంరాజు, మాజీ ఎంఎల్ఎ పంతం గాంధీమోహన్, నాయకులు మల్లిపూడి రాంబా బు, డిసిసి అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు, తుమ్మల దొరబాబు, తోట రాజా కరుణాకర్, చిలకపాటి సుదర్శన్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - కాజులూరు

స్థానిక శ్రీ కోటి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ముందస్తుగా జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్ కాదా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం సంక్రాంతి సంబరాలను ముందస్తుగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్, మాజీ ఎంపిపి యాళ్ళ కృష్ణారావు, ఎంఇఒ డేవిడ్, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లీదండ్రులు, స్థానిక నాయకులు వెంకటరమణ పాల్గొన్నారు.

భోగి మంటలో పాల్గొన్న నిర్వాహకులు

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - కాకినాడ

పారిశుధ్య నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. బుధవారం ఆమె నగరంలోని 7, 8 డివిజన్లలో పర్యటించారు. అక్కడ జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల రోడ్డులో చెత్త సేకరణ పనులు ఎలా జరుగుతున్నదీ ఆరా తీశారు. చెత్త సేకరణ వెహికల్స్ ఆలస్యంగా రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో విధులకు హాజరుకావాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

మాజీ సర్పంచ్ నాగరాజు మృతి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని రాజవరం పంచాయతీ మాజీ సర్పంచ్ పిట్ల నాగరాజు(78) బుధవారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. 2001 నుంచి 2006 వరకు సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారు. నాగరాజు మృతి పట్ల టిడిపికి చెందిన పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్‌సి సర్వేపై 211 అభ్యంతరాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో నిర్వహించిన ఎస్‌సి సర్వేపై ఇప్పటి వరకు 211 అభ్యంతరాలు వచ్చాయని తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌సి సర్వేపై అభ్యంతరాలను తెలిపేందుకు గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించామన్నారు. ఈనెల 20వ తేదీన తుది జాబితాను అన్ని సచివాలయాలలో ప్రదర్శిస్తామని తెలిపారు.

కార్టూ'నిజం'



వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరంలోని మెయిన్ రోడ్డు పులవర్తివారి వీధి యునియన్ బ్యాంక్ పక్కన ఏర్పాటు చేసిన వైశ్యరాజు జ్యూయలర్స్ వారి నూతన షోరూమ్ బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ప్రత్యేక అతిథిగా కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) హాజరై ప్రారంభించారు. కాకినాడ షోరూమ్ భూస్వామి పాబోలు బాబూరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ ఛైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, తుని షోరూమ్ భూస్వామి గ్రంది నారాయణరావు పాల్గొన్నారు. సోము దుర్గాప్రసాద్ మొదటి కొనుగోలు చేశారు. వైశ్యరాజు జ్యూయలర్స్ మేనేజింగ్ డైరక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతమైన కాకినాడలో తమ షోరూమ్‌ను ప్రారంభించాలని ఎప్పటి నుంచో అనుకున్నామన్నారు. ఆ కల పండుగ మాసంలో నేడు నెరవేరిందన్నారు. ఇది చాలా సంతోషంగా ఉందని తెలిపారు. విన్నూతమైన కలెక్షన్లతో ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని రకాల 22 క్యారెట్ల బంగారు ఆభరణాలను క్యాష్, యుపిఐ, ఇ-ట్రాన్స్‌ఫర్‌ల ద్వారా ఫ్లాట్ 6శాతం తరుగుకే ఆభరణాలను అందిస్తున్నామని తెలిపారు. అలాగే సాదారణ వెండి వస్తువులపై తరుగు, మజూరి లేదన్నారు. జిఎస్‌టిని కూడా తామే చెల్లిస్తామన్నారు. అదనంగా కేజి వెండి వస్తువుల కొనుగోలుపై కేజికి రూ.10వేల వరకూ తగ్గింపు ఉందన్నారు. ఈ ఆఫర్ కొన్ని రోజులు మాత్రమే ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ షోరూమ్‌ను సందర్శించాలని కోరారు. తమ ప్రత్యేకమైన డిజైనరీ కలెక్షన్లను ఎంపిక చేసుకొని ఈ ఆఫర్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరక్టర్లు వైశ్యరాజు నరేష్‌రాజు, వైశ్యరాజు కిరణ్‌కుమార్‌రాజు, పి.వెంకట నాగసూర్యపున్నయ్య, పి.వెంకట సింహాచలం, గుల్లపూడి నందు, పేకెటి ఈశ్వర్ పాల్గొన్నారు.

షోరూమ్‌ను ప్రారంభిస్తున్న బాబూరావు

షోరూమ్ యాజమాన్యంతో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, కుడా ఛైర్మన్ రామస్వామి

నేరాలు ఘోరాలు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

ప్రజాశక్తి - జగ్గంపేట

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంతో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో 18 మందిని మద్యం తాగి వాహనం నడుపుతుండగా వారిని అదుపులోకి తీసుకొని కోర్టులో ప్రవేశపెట్టామనిసిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున 13 మందికి జరిమానా విధించినట్లు తెలిపార. మరో ఐదుగురుకి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధి కొమరాజులంక బస్టాండ్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ప్రకారం అమలాపురం నుంచి రావులపాలెం వచ్చే రహదారి చెంతన నున్న కొమరాజులంక బస్టాండ్‌లో సుమారు (35) సంవత్సరాల వయస్సు గల పురుషుని మృతదేహం ఉన్నట్లు స్థానిక విఆర్‌ఒ ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసుస్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతిని వివరాలు తెలిసిన వారు ఎస్‌హెచ్‌ఒ, ఎస్ఐకి సమాచారం అందించాలని పోలీసు తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని గ్రామాలలో బుధవారం ఎస్ఐ ఎస్.రాము తన సిబ్బందితో పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించారు. రాజవరం గ్రామ శివారున పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,210 స్వాధీనం చేసుకున్న కేసు నమోదు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు..

160 కోడి కత్తుల స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రానున్న సంక్రాంతిని పురస్కరించుకుని నిర్వహించిన దాడుల్లో 160 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి డి.శ్రీహరిరాజు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వాధీనం చేసుకున్న కత్తులతోపాటు, సంబంధిత వ్యక్తిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందాలు, గుండాట, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పండుగ పర్వదినాలను ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యుల మధ్య జరుపుకోవాలని ఆయన సూచించారు. కోడిపందాలు, జుదాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిఐ బి.సూరిఅప్పారావు, ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కత్తితో హల్‌చల్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన విద్యార్థిపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...మండలంలోని చెందుర్తి గ్రామానికి చెందిన ఒక విద్యార్థి గొల్లప్రోలు జడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన మరో బాలిక ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఆ విద్యార్థినిపై విద్యార్థి తప్పుడుగా ప్రచారం చేస్తున్నాడు. బుధవారం ఇదే అంశాన్ని కళాశాల సమీపంలో తనపై ఎందుకు తప్పుడుగా ప్రచారం చేస్తున్నావని నిలదీసింది. దీంతో ఆ విద్యార్థి ఆమెపై దాడి చేశాడు. దాడిని అడ్డుకోబోయిన వారిని చంపేస్తానని, కత్తి తీసి భయభ్రాంతులకు గురిచేశాడు. స్థానికులు అధిక సంఖ్యలో సంఘటన ప్రాంతానికి చేరుకోవడంతో ఆ విద్యార్థి అక్కడ నుంచి పారిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పారిపోయిన విద్యార్థి వదిలేసిన కత్తి, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని కాండ్రకోటలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊట ను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. దీనికి సంబంధించి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాద్‌రావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం సీజ్ పలువురిపై కేసులు నమోదు

ప్రజాశక్తి-గోపాలపురం

రైస్ మిల్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ రైస్‌ను సీజ్ చేసి పలువురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. కోమటికుంటలోని మాతంగి మాత అగ్రో ప్రైవేట్ లిమిటెడ్ రైస్ మిల్లులో 44 బస్తాల పిడిఎస్ బియ్యం, రైస్ మిల్లు ఆవరణలో ఉన్న లారీలో 580 పిడిఎస్ బియ్యం బస్తాలను గుర్తించినట్లు తెలిపారు. వీటి విలువ రూ.14,31,111గా అంచనా వేసినట్లు తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుపై మిల్లు యజమానులు, లారీ యజమాని, లారీ డ్రైవర్‌పై గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

క్రికెట్ టోర్నీలో చాగల్లు జట్టు విజయం

ప్రజాశక్తి-చాగల్లు

ఎన్‌టిఆర్ ప్రీమియం క్రికెట్ టోర్నమెంట్‌లో చాగల్లు టీము విజయం సాధించింది. బుధవారం చాగల్లు నిడదవోలు జటు పోటీ పడగా చాగల్లు టీమ్ విజయం సాధించింది. టిడిపి సీనియర్ నాయకులు కోడూరి ప్రసాద్, నాదెండ్ల శ్రీరామ చౌదరి, జగతా వీరభద్రరావు, కరటూరి సతీష్, కొటారు అశోక్ బాబు పాల్గొన్నారు.

క్రీడలపై యువత మక్కువ చూపాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని పలు మండలాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ యువతకు క్రీడా పోటీలు నిర్వహించారు. **ప్రత్తిపాడు** యువత సంప్రదాయ క్రీడలపై మక్కువ చూపాలని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక హైస్కూల్లో బుధవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సంక్రాంతి క్రీడా పోటీలను ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతిని పురష్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ క్రీడల్లో యువత ఉన్నతంగా రాణించాలని అన్నారు. డిఎస్‌పి శ్రీహరిరాజు మాట్లాడుతూ గ్రామీణ యువతను సంప్రదాయ క్రీడల పట్ల ఆసక్తిని

శంఖవరంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న డిఎస్‌పి

పెంపుదల చేసేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐ సూర్యఅప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్ముల కన్నబాబు, వెన్నా శివ, బద్ది రామారావు, ఇళ్ల అప్పారావు, చెక్కపల్లి మందేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **శంఖవరం** యువత మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని డిఎస్‌పి శ్రీహరిరాజు అన్నారు. సత్యదేవ డిగ్రీ కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత జూధాలు వంటి క్రీడల వైపు వెళ్ళకుండా సంప్రదాయ క్రీడల్లో రాణించాలని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ హరిబాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ పాల్గొన్నారు. **తాళ్లరేవు** విద్యార్థులు సన్మార్గాన్ని అనుసరించడం ద్వారా జీవితంలో ఉన్నతంగా రాణించగల్గుతారని సిఐ చైతన్యకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక హైస్కూల్లో సంక్రాంతి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధి చెందిన సాంకేతికతను విద్యార్థులు ప్రగతి కోసమే వాడాలన్నారు. చెడు అలవాట్లకు లోనైన వారిని చట్టం క్షమించదని తెలిపారు. ఈ సందర్భంగా వాలీబాల్ కబడ్డీ

ప్రత్తిపాడులో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ సత్యప్రభ

క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ, హైస్కూల్ హెచ్‌ఎం ఆశాలత బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు ఎంవి.నాగేంద్ర, వి.భానుమతి, ఉపాధ్యాయులు కిషోర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. **కరప** స్థానిక జడ్‌పి హైస్కూల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ చైతన్యకృష్ణ ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో నడకుదురు జట్టు విన్నర్‌గానూ, గురజనాపల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ వి.సూరిబాబు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేలకు బరుల సిద్ధం

-ఏర్పాట్లులో నిర్వాహకులు -ప్రభుత్వ నిబంధనలు వర్తించేనా?

ప్రజాశక్తి - సామర్లకోట

ఇంకా వారం రోజులు ఉండగానే సామర్లకోట మండలంలో సంక్రాంతి కోడిపందాలకు రంగం సిద్ధం అవుతుంది. మండలంలోని పనసపాడు, వేట్లపాలెం గ్రామాలు

జనసేన జెండా పట్టుకుని బరులను పరిశీలిస్తున్న నాయకులు

సంక్రాంతి కోడి పందాలకు పేరు గాంచిన విషయం తెలిసిందే. పనసపాడు గ్రామంలో అచ్చంపేట ఏడిబి రోడ్డును ఆనుకుని ప్రతియేటా కోడిపందాలు, గుండాటలు జరుగుతుండగా కోట్లలోనే వ్యాపారం జరుగుతుంటుంది. అయితే వీటి నిర్వహణకు బ్లేడ్ ట్రాక్టర్, బుల్డోజర్ వాహనాలతో ఎన్‌జిఒ కాలనీ కాలనీ పంచాయతీ పార్కులో పెద్ద పెద్ద బరులు సిద్ధం చేస్తున్నారు. అయితే సంక్రాంతి పండుగకు కేవలం 3 రోజులు మాత్రమే సమయం ఉండగా ఇప్పటి అధికారులు కోడిపందాలు, గుండాటల నిర్వహణకు వ్యతిరేకంగా ఎలాంటి హెచ్చరికలు జారీ చేయక పోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి సైతం పందెం పుంజులను ఇక్కడకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో ఇటీవల తాజాగా రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదం కొందరి హత్యలకు దారి తీయగా ఆ నేపథ్యంలో గ్రామంలో కోడిపందాలు నిర్వహిస్తే దానిని వేదికగా తీసుకుని వివాదాలు జరిగే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఒక గ్రామంలో జనసేన నాయకులు జండాలు చేతపట్టి మరి కోడిపందాలు

పందేలకు బరులు సిద్ధం చేస్తున్న బ్లేడ్ ట్రాక్టర్

అవసరమైన బరులు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దానికి తోడు ఈ క్రమంలో ఈ ఏడాది కోడిపందాల నిర్వహణకు గానూ నిర్వాహకులెవరూ ముందుకు రావడం లేదనే వార్తలు వినిపిస్తున్నాయి. కాగా సంక్రాంతి వేడుకల్లో మూగ జీవాల ప్రాణాలను పాణంగా పెట్టే ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా జిల్లాస్థాయి అధికారులు తగిన కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని శెట్టిబలిజ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు రాయుడు మోజేష్ బాబు కోరుతున్నారు.

అపరాల సాగుపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - రౌతులపూడి, ఏలేశ్వరం

అపరాల సాగుపై ప్రత్యేక జాగ్రత్తలు అవసరమని వ్యవసాయ అధికారి ఈశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని గంగవరంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ అనంతరం వేసిన అపరాల పంటను ఆశించే కీటకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఎప్పటికప్పుడు పంటను పరిశీలిస్తూ అవసరమైన సలహాలను వ్యవసాయ శాఖ అధికారుల తీసుకుని పంటను కాపాడుకోవాలని సూచించారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. అలాగే ఏలేశ్వరం మండలంలోని ఎర్రవరం, పెద్దనాపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మండల

ఏలేశ్వరంలో మాట్లాడుతున్న ఎఒ జ్యోతి

వ్యవసాయ అధికారి బి.జ్యోతి పాల్గొని మాట్లాడారు. ఎపిఎస్ఎస్ యాప్ ఆవశ్యకతను వివరించారు. రైతుల మొబైల్ ఫోన్లో డౌన్‌లోడ్ చేయించారు. రైతులు తమ పొలాల్లో పురుగులు, ఇతర తెగుళ్ల సోకితే ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. వాటి నివారణకు తగిన సూచనలు, సలహాలను పొందవచ్చునని అన్నారు. ఈ ప్రక్రియ ద్వారా రైతుకు సమయం వృధా కాకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహదం

ప్రజాశక్తి - కాకినాడ

విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు రంగోలి దోహదం చేస్తుందని విబివిఆర్ చారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎండోమెంట్స్ కాలనీలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని సైన్స్ రంగోలి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోటీ తత్వాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల హెచెం కెఎన్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా రంగోలి పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించడానికి ఇటువంటి పోటీలు సహకరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.కృష్ణమోహన్, సిసిఆర్‌టి జిల్లా రిసోర్స్‌పర్సన్ కెవిఎస్ఎస్.ప్రసాద్, కేసరి శ్రీనివాస రావు, రత్నప్రసాద్, కృష్ణమూర్తి పాల్గొన్నారు. విజేతలకు ప్రశంస పత్రాలు, బహుమతులను అందజేశారు.

ముగ్గులను పరిశీలిస్తున్న నిర్వాహకులు

భవిష్యత్ తరాల మనుగడకు మొక్కలే శరణ్యం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

భవిష్యత్ తరాల మనుగడ మొక్కల ద్వారానే ఉందని ప్రకృతి పరిరక్షణ సంఘం అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎస్ విజయబాబు అన్నారు. బుధవారం ఆర్ఐ అవసరాల కిషోర్, దేవీ దంపతులు ఏర్పాటుచేసిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు, ప్రకృతిని పరిరక్షించేందుకు మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడం అలవాటుగా చేసుకోవాలని కోరారు. అనంతరం లింగంపర్తి రోడ్, ఎర్రవరం రోడ్లలో మొక్కలు

మొక్కను నాటుతున్న నిర్వాహకులు

నాటారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గల్లీ కిషోర్, ప్రకృతి పరిరక్షణ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు, కార్యదర్శి గోళ్ళ నాగేశ్వరరావు, జ్యోతుల నాగసత్యశ్రీనివాస్, డివివి.సత్యనారాయణ, కరోతు సత్యనారాయణ, రౌతు సహదేవుడు, నారాయణరావు, గంగరాజు, రవి పాల్గొన్నారు.

గొల్లప్రోలు సొసైటీ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గొల్లప్రోలు విశాల సహకార పరపతి సంఘం ఉద్యోగులు నిరసన చేపట్టారు. బుధవారం సొసైటీ ఉద్యోగుల రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఉద్యోగులు సొసైటీ కార్యాలయం వద్ద కొద్దిసేపు నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం హామీ ఇచ్చిన హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. పదవీ విరమణ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు మార్పు చేయాలని, జిఒ నెంబర్ 36 ప్రకారం ఇతర బెనిఫిట్స్ అమలు చేయాలని, వేతన సవరణ జరిపే లోపు భృతి ఇవ్వాలని కోరారు. ఇన్ కమ్ టాక్స్ నుంచి తమకు పూర్తిగా మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సొసైటీ సిఇఒ ఆదిరెడ్డి సూరిబాబు, సిబ్బంది బసా గోవిందు, కుర్రే శంకర్, మొగలి వీరభద్రరావు, బసా లవకుశలు, రామిశెట్టి సూర్య నాగేంద్ర, ఎం.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి : లెఫ్టినెంట్ గవర్నర్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలోని నాలుగు రీజియన్లు యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి ప్రాంతాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాషనాథన్ అన్నారు. యానాం ప్రజా ఉత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానాం ప్రజా ఉత్సవాలు, ఫలపుష్ప ప్రదర్శనల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సంక్రాంతికి ముందే పండుగ వాతావరణం యానాంలో కన్పిస్తుందన్నారు. పుదుచ్చేరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సివుందని, ఆదిశగా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. తాను 1965లో చెన్నైలో చదువుకుం టున్నప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమహేం ద్రవరం, కాకినాడ, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు చెందిన తెలుగు మిత్రులు ఉండేవారని గుర్తు చేసుకున్నారు. గోదావరి, బేఆఫ్ బెంగాల్ ప్రదేశం ఆర్థికాభివృద్ధికి ఉపకరిస్తుందన్నారు. ప్రధానమైన సమస్యలను గవర్నర్ దృష్టికి ఎంఎల్‌ఎ అశోక్ తీసుకెళ్లారు. నియోజకవర్గ పరిధిలో ప్రధానమైన వైద్య, ఆరోగ్యపరమైన మౌళిక సదుపాయాల కల్పన, ఆయుష్మాన్భారత్ పథకాన్ని యానాంలో అమలు చేయాలని కోరారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ అరటికాయలంక నుంచి కనకాలపేట మీదుగా జెండాస్థంభం వరకు నేషనల్ హైవేస్ సంస్థచే రహదారి విస్తరణ, సిఎస్‌ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు, పలు శాఖల్లో ఎన్‌ఎంఎంలుగా ఉన్నవారిని పర్మినెంట్ చేయాలని కోరారు. యానాం ప్రజాఉత్సవాలను గత కొన్నేళ్లుగా బాలయోగి స్టేడియంలో ప్రణాళికాబద్దంగా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఒఎన్‌జిసి పరిహారం అంతా లబ్దిదారులకు సక్రమంగానే అందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి మునిస్వామి, మంత్రి కె. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. యువతీ, యువకులుకు వాలీ బాల్, కబడ్డీ, రన్నింగ్, సైక్లింగ్ ఆటలు పోటీలు నిర్వహించారు. జిల్లా యువజన అధికారి తిర్రి గోపి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడానికి ఈ

విజేతలతో ఉపాధ్యాయులు

కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలుకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కర్ రెడ్డి చేతులమీదుగా బహుమతులు, ప్రశంస పత్రలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాలయులు టి.ముత్యాలు, కొప్పనాతి రమేష్, చంద్రశేఖర్, వడ్డి వరప్రసాద్ పాల్గొన్నారు.

కోలాటం చేస్తున్న విద్యార్థులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - కాకినాడ

శాంతినగర్‌లోని ప్రియా హోటల్ మేనేజ్‌మెంట్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపల్ అధ్యక్షతన జరిగిన ఈ సంబరాల్లో యువసేన సతీష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు అలేగే మామా బ్రో యూట్యూబ్ స్టార్ సనా హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్, తాడి నరేంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సమాజంలో క్షణం తీరిక కూడా ఉండట్లేదన్నారు. ఇలాంటి సమయంలో ఇన్‌స్టిట్యూట్‌లో సంస్కృతి సంప్రదాయాలను గుర్తు చేస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కోలాటం, హరిదాసు వేషధారణలు ఆకట్టుకున్నాయన్నారు. నేటి తరం పిల్లలకు వీటి ఆవశ్యకతను తెలియజేయడం గొప్ప విషయమన్నారు ఈ కార్యక్రమంలో ఛైర్మన్ టి.పావని, అగస్త్య, రమేష్ సుశీల్ సత్యానందం, మోహన్, కుమారి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు కిశోరి వికాసం ఒకరోజు శిక్షణా కార్యక్రమం బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిడిఒ వివివిఎస్.రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని, బాలికలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా అందరూ కలిసి పని చేయాలని సూచించారు. ఇందుకోసం మండల స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా చక్రవర్తి

ప్రజాశక్తి - కాకినాడ

చక్రవర్తి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా టివిజిజిఆర్. చక్రవర్తి ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర కమిటీ సభ్యులుగా సిహెచ్‌వి. రమణ, సోనీ ఎన్నికయ్యారు. వీరికిఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రస్తుత కాకినాడ జిల్లాలో యూటిఫ్‌లో, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జెఎసిలో వివిధ హోదాల్లో పని చేసిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా ఈ ముగ్గురిని జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగేష్, సూరిబాబు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు ప్రభాకర వర్మ, ఐ.ప్రసాదరావు, టి.అన్నారాం, పలివెల వీరబాబు, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యండమూరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కరప

మండలంలోని యండమూరు గ్రామంలో బుధవారం స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ విశ్రాంత హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎంవిఆర్.మూర్తి పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య సేవ శిబిరాలు నిర్వహించడంలో స్వర్ణాంధ్ర సేవా సంస్థ అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. ఇప్పటివరకు సుమారు 1000కి పైగా వైద్య శిబిరాలు నిర్వహించి లక్షలాది మందికి వైద్య సేవలు అందించారని, అందుకు సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. సమాజ సేవ కోసం జీవితం అంకితం చేస్తున్న రాంబాబు సేవలు అభినందనీయమని విశ్రాంత పోలీసు అధికారి పి.చంద్రరావు అన్నారు. పుట్టిన గ్రామానికి సేవలందిస్తున్న రాంబాబుని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా పిఎంపి డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు తల్లిదండ్రులు, సాంబత్తులు కామరాజుల జ్ఞాపకార్థం ఉచిత వైద్య సేవ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ మారెళ్ళ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎంపి జిల్లా నాయకత్వం డాక్టర్ బల్ల శ్రీనివాసరావు, డాక్టర్ పి.దేవానందం, గ్రామ సర్పంచ్ మారెళ్ళ.శివ, రెవరెండ్ జాన్ సూర్య ప్రకాష్, మధుసూదనరావు, గుబ్బల ఏడుకొండలు, బల్ల యేసయ్య , గోడి చిట్టిబాబు , సాంబతుల రఘువర్మ, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని మల్లిశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ పూర్ణిమ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ పిల్లలకు పండుగల యొక్క ప్రాముఖ్యతను తెలియచేసేందుకు కృషి జరుగుతుందన్నారు. అనంతరం పిల్లలతో కోలాటం ఆడించారు. చిన్నారులకు భోగి పండ్లు వేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సర్వసిద్ది నూకరత్నం, సర్వసిద్ది లక్ష్మణరావు, సూపర్‌వైజర్ అమ్మాజీ, పైడిపాల వెంకటసూర్యనారాయణ, ముత్తా రాజబాబు, పైడిపాల వెంకట సత్య నారాయణ, తొగర ఏసు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో సంక్రాంతి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, ఎస్ఐ మౌనిక అన్నారు. బుధవారం మండలంలోని గోరింట, దివిలి, కాండ్రకోట గ్రామాల్లో వారు పర్యటించారు. గ్రామాల్లో సంక్రాంతిని పురష్కరించుకుని ప్రశాంత వాతావరణంలో సంక్రాంతి పండుగను జరుపుకోవాలన్నారు. గతంలో కోడిపందాలు నిర్వహించిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ దఫా కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

గాడిమొగ పంచాయతీ కార్మికులకు సర్పంచ్ కామాడి గోవలక్ష్మి నూతన వస్త్రాలను, నిత్యావసర సరుకులను అందజేశారు. సంక్రాంతి సందర్భంగా ప్రతి ఏడాది పారిశుధ్య కార్మికులకు, పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలు అందిస్తున్న సర్పంచ్‌కి కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, కామాడి మాతరాజు, పంచాయితీ కార్యదర్శి వెంకటరత్నం పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్థానిక పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సునీత మెర్సి అన్నారు. బుధవారం మండలంలోని తాటిపర్తి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి వివిధ రకాలు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎ.సత్తిబాబు, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిన విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. బుధవారం కిర్లంపూడిలో ఆయన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని, పార్టీ శ్రేణులు బలంగా పనిచేస్తే తిరిగి సిఎంగా జగన్మోహన్ రెడ్డి ఎన్నిక అవుతారన్నారు. నియోజకవర్గంలో వైసిపి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని కోరారు.

పలువురికి పరామర్శ

ప్రజాశక్తి-బిక్కవోలు

ఇటీవల అనారోగ్యంతో మరణించిన బలబద్రపురం గ్రామానికి చెందిన దుండు పాపాయమ్మ, గొర్లు గోవిందు కుటుంబ సభ్యులను మాజీ ఎంఎల్ఎ సత్తి సూర్యనారాయణ రెడ్డి బుధవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం అనారోగ్యంతో బాధ పడుతున్న మండ దుర్గారెడ్డి, గొర్రెపూడి లక్ష్మిని పరామర్శించారు. ఆయన వెంట పోతుల ప్రసాద్ రెడ్డి, కొవ్వూరు వెంకటరామారెడ్డి, ఎస్.వీరరాఘవరెడ్డి వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
F.D.I.A.No.4/2023 in O.S.488/2022
Between:
నంగిరెడ్డి నరేష్‌బాబు ...వాది
Vs
1.కొంజెర్ల బాలాజీ
2.కొంజెర్ల రమేష్
3.నరమామిడి నాగలక్ష్మి ...ప్రతివాద్లు
పై నంబరు ఫైనల్ డిక్రీ పిటిషను వాది తనఖా బాకీ డిక్రీ అయినందున దాఖలు చెయ్యగా శ్రీకోర్టు వారు తనఖా ఆస్థిని వేలం వేయుటకు గాను ది.29-1-25నకు వాయిదా వేసినారు. కావున వేలంలో పాల్గొనుటకు ఆసక్తి కల వారు ది.29-1-25న ఉదయం 10.30 గం॥లకు పైకోర్టులో హాజరయి తనఖా ఆస్థిని వేలంలో పొందవచ్చును. కావున తెలియచెయ్యడమైనది.
తనఖా ఆస్థి వివరం
ప.గో.జిల్లా ప్రస్తుతం తూ.గో.జిల్లా, నల్లజర్ల మండలం, అనంతపల్లి సబ్ డివిజన్ తెలికచర్ల గ్రామం, ఆర్.ఎస్.నెం.286 నందు 210 చ.గ.స్థలంలో పడమర వైపు సగం 105 చ.గ.స్థలంనకు హద్దులు :
తూ : కొంజెర్ల రమేష్ గారి స్థలంకు మరియు ఇల్లు.
ద : మడిచర్ల మాధవరావు గారి స్థలం మరియు ఇల్లు.
ప : కనక జోగయ్య గారి భూమి.
ఉ : కొంజెర్ల సాయి బాబా గారి స్థలం.
పై ఆస్థికి గల యాజమెంటు హక్కులతో సహా.
G.K.Durga Devi
Advocate, Tadepalligudem.
Cell: 9985592776.